క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

పొందూరు: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు మండలంలోని కింతలి గ్రామంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చెక్ బౌన్స్, ప్రాంసరీ నోట్స్‌కు సంబంధించిన న్యాయపరమైన అంశాలను వివరించారు. అనంతరం పలువురు న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



విధుల్లోకి చేరిన డాక్టర్ వసుధ

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా వసుధ శుక్రవారం విధుల్లోకి చేరారు. ఇక్కడ పనిచేసిన ఇద్దరు డాక్టర్లు ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో వారి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. శ్రీకాకుళం అర్బన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసిన వసుధ బదిలీపై తురకపేట ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్ వసుధకు ఆస్పత్రి సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ పంచాయతీ పరిధి మహసింగి గ్రామ సమీపంలో వందలాది ఏళ్ల చరిత్ర గల వరహాలక్ష్మీనరసింహ స్వామి ఆలయం పునః ప్రారంభ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్లాకిమిడి రాజ వంశస్తుల కాలం నాటి ఆలయ పునః ప్రారంభం ఎంతో పవిత్రంగా చేపట్టారు. పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధి గోగులు వరప్రసాద రావు నాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తూర్పుకాపు కుల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు


పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం, సారవకోట, హిర మండలం మండలాల్లో పారా లీగల్ వలంటీర్లగా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలన్నారు. మైత్రి సంఘం, అంగన్‌వాడీ వర్కర్లు, ఎన్జీఓలు, రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, లా విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. పారా లీగల్ వలంటీర్లకు ఎటువంటి జీతం ఉండదని, స్వచ్ఛందంగా పనిచేయాలన్నారు. మరిన్ని వివరాలకు పాతపట్నం కోర్టు ఆవరణలో ఉన్న మండల న్యాయ సమితిని సంప్రదించాలన్నారు.

13న గ్రామ దేవత ఉత్సవాలు

ఆమదాలవలస రూరల్: ఈ నెల 13న ఆమదాలవలస మండలం వంజంగిలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ దేవత ఉత్సవ కమిటీ నిర్వాహకులు బెండి గోవిందరావు, ఎండ అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం గ్రామ దేవత ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు

పొందూరు రూరల్: కచ్చితమైన ఆధారాలను సమర్పిస్తే మ్యుటేషన్ల, రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు తెలిపారు. మండలంలోని కనిమెట్ట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ రీసర్వేలో మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించారు. రీసర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో.. ప్రయోజనాలు

- సేంద్రియత పెంచేందుకు సన్నద్ధం
- పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు
- 50 శాతం రాయితీపై విత్తనాల సరఫరా



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ఎల్.ఎన్.పేట: భూసారం పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారులు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయిస్తున్నారు. పచ్చిరొట్ట సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రైతులు గుర్తించాలని అవగాహన కల్పిస్తున్నారు. భూమిని సారవంతంగా మార్చాలన్నా, రసాయన ఎరువులు, పురుగు మందుల అవశేషాల్లేని దిగుబడులు సాధించాలన్నా.. పచ్చిరొట్ట సాగు ఎంతో ఉపయోగకరమని చెబుతున్నారు.

భూసారాన్ని పెంచే ప్రయోజాలెన్నో..

పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమిలోని పోషకాలు చేనుకు సమతుల్యంగా అందివ్వటంలో కీలక పాత్ర పోషిస్తుంది. చేను పెరుగుతున్న సమయంలో పోషకాల లోపంతో పంటకు నష్టం జరగకుండా భూమిలో ఉన్న పోషకాలను అందించటం వలన రైతుకు ఎరువుల వినియోగం తగ్గుతుంది. పంటకు, భూమికి మేలు చేసే మిత్ర పురుగుల్లో ప్రధానంగా చెప్పుకునే వాన పాములు సంఖ్య పెరుగుతుంది. భూమి పొరల్లో తేమ శాతం నిల్వ ఉంచుతుంది. రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గిస్తుంది. పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చేసేందుకు దోహద పడుతుంది.

ఇలా చేయాలి..

వరుసగా మూడు నుంచి ఐదేళ్ల పాటు పచ్చిరొట్ట సాగు చేస్తే ఎరువుల వినియోగం సగానికి తగ్గిపోతుంది. పచ్చిరొట్ట సాగులో జీలుగు, కట్టిజనుము, పిల్లిపెసర, అలసందలు వంటి రకాలున్నాయి. మనకు అందుబాటులో ఉండేవి కట్టి జనుము, జీలుగు విత్తనాలే. మేలో కురిసే వర్షాలకు పొలాన్ని మెత్తగా దుక్కిచేసి నెలాఖరులో, జూన్ మొదటి, రెండు వారాల్లో పదును ప్రకారం పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. రెండు అడుగుల ఎత్తువరకు పచ్చిరొట్ట చేను పెరిగిన తరువాత పొలాన్ని దుక్కి చేసి వరి వెదలు వేసుకోవచ్చు. దమ్ము కోసం పొలాన్ని ఉంచితే నారు మడుల్లో విత్తనాలు వేసుకునే వారం, పదిరోజులు ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుంటే 30 నుంచి 40 రోజుల మధ్యలో దమ్ము చేయాలి. వారం రోజులు మురిగిన తరువాత నాట్లు వేసుకోవాలి.



పచ్చిరొట్ట సాగు (ఫైల్)

రైతు సేవా కేంద్రాల్లో..

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఆధార్ కార్డు తీసుకు వెళ్లి తమ వివరాలను బయోమెట్రిక్ వేసి నమోదు చేసుకోవాలి. విత్తనాలు వచ్చిన తరువాత నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవాలి.

రకం	పూర్తి ధర	రాయితీ ధర	రైతు చెల్లించాల్సిన ధర
జీలుగు	రూ.123	రూ.61.50	రూ.61.50(కిలో)
కట్టిజనుము	రూ.109	రూ.54.50	రూ.54.50(కిలో)
పిల్లిపెసర	రూ.180	రూ.90.00	రూ.90.00(కిలో)

ప్రతీ ఏడాది సాగు చేస్తున్నాం



గత కొన్ని సంవత్సరాలుగా పచ్చిరొట్ట సాగు చేస్తునే ఉన్నాం. దమ్ముకు ఉంచిన పొలంలో పచ్చిరొట్ట వేస్తాం. ఈ ఏడాది పచ్చిరొట్ట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు ఇస్తారని తెలిసింది. విత్తనాల నమోదు కోసం అనేక మంది రైతులకు అవగాహన లేక నష్టపోతున్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలి.

– లుకలాపు రాజారావు, రైతు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

పేర్లు నమోదు చేసుకోవాలి..



పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల నుంచి పొందవచ్చు. రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు తీసుకువెళ్లి వ్యవసాయ సహాయకునితో సంప్రదించి బయోమెట్రిక్ వేయాలి. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుంటే 50 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నాం. రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం.

–పైడి లతశ్రీ, ఎఓ, ఎల్.ఎన్.పేట

సూపర్ సిక్స్ అమలు చేసేది ఎప్పుడు?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు ఆరోపించారు. శుక్రవారం స్థానిక వేణుగోపాల ఆలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. అప్పుల సాకుతో సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.2.70 లక్షల కోట్లు కేవలం ప్రజల ఖాతాల్లో జమ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలల్లోనే 1.40 లక్షల కోట్లు అప్పు చేసి ప్రజలకు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమ్మ ఒడి, రైతు భరోసా అందించారని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమిచ్చిందని ప్రశ్నించారు. పాతపట్నం మాజీ ఎమెల్యే రెడ్డి శాంతి కృషితో నియోజకవర్గానికి తాగునీటి కోసం అప్పట్లో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.263 కోట్లు నిధులు ఇచ్చారన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ద్వారా తాగునీటిని అందించాల్సి ఉన్నా.. కూటమి ప్రభుత్వం కనీసం తాగునీరు అందించలేకపోయిందన్నారు. వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు హరిశ్చంద్ర సామలో, నాయకులు సీయాకు రాజారావు, సవర భాస్కరరావు, పరపటి యోగీశ్వరరావు, ఉల్లాస రవికుమార్, బాబూరావు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో అడ్డంగా విద్యుత్ స్తంభాలు

- నిలిచిన పనులు



డ్రైనేజీలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస కాలనీలో గత రెండు నెలలుగా డ్రైనేజీ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. కాలనీలో సుమారు రూ.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు. డ్రైనేజీలో అడ్డంగా నాలుగు చోట్ల ఉన్న విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటిని తొలగించాలని కాలనీకి చెందిన పలువురు విద్యుత్ శాఖ అధికారులకు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే స్తంభాలను తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. రెండు నెలలు అవుతున్నా స్తంభాలు తొలగించక పోవటంతో పనులు నిలిచిపోయాయి. మరికొన్ని రోజుల్లో వర్షాకాలం వస్తుందన్నందున పనులు అలాగే ఉండిపోతే నీరు నిలిచిపోతుందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వీధిలో నడిచి వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను తొలగించటంతోపాటు డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తిచేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణ!



కుచించుకుపోయిన మెళియాపుట్టి-పలాస రహదారి

- పక్కా నిర్మాణాలు..
- దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయం
- పట్టించుకోని అధికారులు..

పాతపట్నం: నియోజకవర్గం కేంద్రం పరిధిలో ప్రభుత్వ స్థలాలు దర్జాగా ఆక్రమిస్తున్నారు. వీటిలో నిర్మాణాలు చేపట్టి విక్రయాలు కూడా చేస్తున్నారు. అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తుండటంతో రోజురోజుకూ ఆక్రమణలు పెరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆక్రమణ స్థలాల్లో పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్ నుంచి మెళియాపుట్టి, పలాస ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని తాజాగా ఆక్రమణ చేసి విక్రయాలు చేపట్టారు. బ్రాహ్మణ వీధి మెయిన్‌రోడ్డు నుంచి యశోదనగర్ వరకు కొంత మంది స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. వీరు ఒక్కొక్క దుకాణానికి సరిపోయే స్థలాన్ని రూ.50 నుంచి రూ.80 వేల చొప్పున చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన స్థలం కాదా అని.. తారు రోడ్డు వరకు వీరు నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆల్‌ఆంధ్రా రోడ్డులో తిడ్డిమికి వెళ్లే రహదారిలో ఎక్కువ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ స్థలాల్లో ఆక్రమ నిర్మాణాలు చేస్తుండడం విశేషం. ప్రధాన రహదారి వరకు ఆక్రమించి నిర్మాణాలు జరపడటంతో ఇటీవల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటలకే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఆల్ ఆంధ్రా కూడలిలో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి విక్రయాలు చేపడుతున్నా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి ఆక్రమణలను తొలగించాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీలోని మన్నెపేట కొండపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రుత్వికులు గన్నవరపు రాంబాబు, మావుడూరు సంతోష్‌శర్మ, కిరణ్ శర్మ వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బీఎఫ్‌టీ తీరుపై ఆరా!

మెళియాపుట్టి: ఉపాధి హామీ పథకంలో బీఎఫ్‌టీగా (టెక్నికల్ అసిస్టెంట్ నిర్వహించాల్సిన విధుల స్థానంలో) విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ వైఖరిపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇటీవల సిరియాఖండి పంచాయతీలోని మాకనాపల్లి, సిరియాఖండి గ్రామాల్లో వేతనదారులకు ఇబ్బందులకు గురిచేసి వారి ఆగ్రహానికి కారణమయ్యాడు. గిరిజన గ్రామ పంచాయతీ ఆంపురంలో సైతం వేతనాలు తగ్గించి ఇవ్వడమేకాకుండా.. గిరిజనులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో గొడవలు జరిగాయి. అతను పనిచేస్తున్న అన్ని గ్రామ పంచాయతీలలో కూడా వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతనిని విధుల నుంచి తప్పించాలని వేతనదారులు కోరుతున్నారు. అతనితో కలిసి పనిచేయలేకపోతున్నామని క్షేత్ర సహాయకులు ఉర్లాన షణ్ముఖరావు, డొలిబేరు వెంకటేష్, సిరిపురం జగదీశ్వరరావు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై శ్రీకాకుళం డ్వామా కార్యాలయానికి బీఎఫ్‌టీ వెంకటరమణను పిలిపించినట్లు తెలుస్తోంది. వెంకటరమణకు షోకాజ్ నోటీసు జారీ చేస్తామని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా తెలిపారు.

నవధాన్యాల సాగుతో మేలు

సారవకోట: మండలంలోని చీడిపూడి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నవధాన్యాల సాగుపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. దీంట్లో భాగంగా నవధాన్యాల సాగు చేసేందుకు విత్తనాల తయారీ, ఈ సాగు చేయడం వలన కలిగే లాభాలు, ఎప్పుడు సాగు చేసుకోవాలనే తదితర అంశాలను వివరించారు. వీఏఏ దిలీప్, ఐసీఆర్పీలు ప్రకాశ్, జి.భవానీ, లక్ష్మీ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

పాతపట్నం: మండలంలోని పెద్దమల్లిపురంలో గ్రామ దేవత ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా నీలమణిదుర్గ, లక్ష్మీ, సరస్వతీ దేవి విగ్రహాల ప్రతిష్టను శుక్రవారం ఘనంగా చేపట్టారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలను అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహాలను గ్రామంలో తిరువీధి చేపట్టారు. పెద్దమల్లిపురం గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

రోడ్డుపై మురుగునీరు ప్రవాహం



ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేట ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారికి ఆనుకొని సబ్‌ట్రెజరీ, తహసీల్దార్, పోస్టాఫీస్, తదితర కార్యాలయాలు ఉండడంతో నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. మున్సిపల్ అధికారులు స్పందించి రహదారిపైకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలని పూజారిపేట వాసులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

- ఆమదాలవలస

తిరువీధి ఉత్సవం..



నరసన్నపేట పట్టణంలో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని శుక్రవారం శేష వాహనంపై తిరువీధి చేపట్టారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఊరేగించారు. ఆలయ ట్రస్టీ సభ్యుడు పి.కృష్ణప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- నరసన్నపేట

గుర్రపుడెక్క..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని ఏఎల్‌నగరం సమీపంలో ఓపెన్ హెడ్ ఛానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క. యరగాం–పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ ఛానల్ తోపాటు, వంశధార కుడిప్రధాన, పిల్ల కాలువల్లో గుర్రపు డెక్క విస్తారంగా పేరుకుపోయింది. శివారు ప్రాంతాలకు ఏటా సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరికొద్దిరోజుల్లో ఖరీఫ్ ప్రారంభంకానుంది. అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వంశధార జేఈ శోభన్ వద్ద ప్రస్తావించగా.. గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకొంటామని వెల్లడించారు.

- సరుబుజ్జిలి

వినియోగంలోకి వచ్చేదెప్పుడు?



సారవకోట మండలంలోని చిన్న గుజ్జువాడ గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం వినియోగంలోకి వచ్చేదెప్పుడని స్థానికులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయినా దీనిని వినియోగంలోకి తీసుకురాక పోవడంతో స్థానికులు పలువురు కర్రలు, ఇతర సామగ్రి భద్రపర్చుకుంటున్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సేవలు అందిస్తున్నారు.

- సారవకోట

కొత్తూరు సీహెచ్‌సీలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది



బెడ్‌పై ఉన్న క్షతగాత్రునికి వైద్యం అందజేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తూరు సీహెచ్‌సీలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్షతగాత్రులకు ఏ విధంగా వైద్య సేవలు అందివ్వాలన్న అనే అంశంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి బెడ్‌పైకి ఏ విధంగా తీసుకువెళ్లాలి, ఎటువంటి వైద్యం అందించాలనే అంశాలపై మాక్ డ్రిల్ చేపట్టారు. మాక్ డ్రిల్‌లో వైద్యాధికారి అనూష, హెడ్ నర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల ఒప్పందాలు రద్దు చేయాలి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తూరు: యాక్సిస్, సెకి కంపెనీలతో కుదుర్చుకున్న విద్యుత్ చార్జీల ఒప్పందాలను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. కొత్తూరు ట్రాన్స్‌కో ఏఈ నిరంజన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. సీఎం చంద్రబాబు.. అడ్డుగోలుగా యాక్సిస్, సెకి కంపెనీలతో విద్యుత్ చార్జీల ఒప్పందాలు కుదుర్చుకున్నారని అన్నారు. విద్యుత్ వినియోదారులపై 25 ఏళ్ల పాటు భారం పడేలా ఒప్పందాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారుల నెత్తిన భారం మోపారన్నారు. సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం తగదన్నారు. యాక్సిస్, సెకి ఒప్పందాలను రద్దు చేసే వరకు ప్రజల భాగస్వామ్యంతో ఆందోళన చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, కృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.